క్లుప్తంగా

19న మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

సామర్లకోట: స్థానిక మండల పరిషత్ బడ్జెట్ సమావేశాన్ని ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

'పండుగొ'ప్పకు గిరాకీ


ఉప్పాడ మార్కెట్‌లో పండుగొప్ప చేప

పిఠాపురం: సంక్రాంతి సంబరాలలో కనుమ పండగ నాడు నాన్‌వెజ్‌కు నాన్‌స్టాప్ లేకుండా పోయింది. చేపలలో అత్యంత విలువైన పండుగొప్పలకు మంచి గిరాకీ ఏర్పడింది. ఉప్పాడ తీరంలోని మార్కెట్‌లో వీటి అమ్మకాలు విరివిగా జరిగాయి. పండగకు వచ్చిన బంధువుల కోసం పండుగొప్ప చేపలను కొనుగోలు చేయడానికి బారులు తీరడంతో వాటి రేట్లు ఆకాశాన్నంటాయి. పందెంలో ఓడిన కోడి కోస మాంసంతో ఈ చేప పోటీ పడింది. చేపను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.నాలుగు వేల వరకూ పలికింది.

పొద్దెక్కినా వీడని మంచు


కొత్తపల్లిలో తెల్లవారినా వదలని మంచు తెర

పిఠాపురం: చలి వణికిస్తోంది.. ఉదయమైనా మంచు తెర వీడడం లేదు. తెల్లవారుజామున గ్రామాల్లో వినిపించాల్సిన పక్షుల కూతలు చలికి భయపడి ఆగిపోతున్నాయి. కోడి కూతకు మొరాయిస్తోంది. అందరూ చలి నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పగలైనా, రాత్రయినా ఒకటే చలి. బారెడు పొద్దెక్కినా సూరీడు కనిపించడానికే వణుకుతున్నాడు. కొన్ని రోజులుగా పిఠాపురం నియోజకవర్గంలో చలి పంజా విసరడంతో సగటు జీవులు అల్లాడిపోతున్నారు. పెరిగిన చలికి తోడు మంచు తెరలు మధ్యాహ్నం కమ్ముకుంటున్నాయి.

జోరుగా సంప్రదాయ కోడి పందేలు


కొత్తపల్లి మండలంలో కోడి పందేలు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సంప్రదాయ కోడి పందేలు జరిగాయి. వాకతిప్ప, కొండెవరం, కొత్తపల్లి, నాగులపల్లి, ఇసుకపల్లి, కొమరగిరి, పొన్నాడ, కొత్తపల్లి, రమణక్కపేట, గొర్స తదితర గ్రామాల్లో పందేలను నిర్వహిస్తున్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

సామర్లకోటలో..

సామర్లకోట: సంక్రాంతిని పురస్కరించుకొని భోగి రోజు నుంచి సోమవారం సాయంత్రం వరకూ కోడి పందేలు నిర్వహించారు.సామర్లకోట మండలంలోని జి.మేడపాడు, వేట్లపాలెం, ఉండూరు, వీకే రాయపురం, అచ్చంపేట, మాధవ పట్నం గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. అయితే గుండాటకు పోలీసులు అనుమతి ఇవ్వక పోవడంతో కోడి పందాల శిబిరాలు వెలవెల బోయాయి. అయితే వేట్లపాలెం, వీకే రాయపురం గ్రామాల్లోను, దివిలి, పులిమేరు, ఆర్బీ కొత్తూరు, దివిలి గ్రామాల్లో మాత్రమే గుండాట నిర్వహించారు. కొన్నిచోట్ల మహిళలు కూడా కోడి పందేలు కాయడం ఆశ్చర్యానికి గురి చేసింది.

పెద్దాపురం: ఈ ఏడాది కోడి పందేలు టెన్షన్ టెన్షన్‌గా సాగాయి. కోడి పందేలకు అనుమతించిన పోలీసులు గుండాటకు మాత్రం అడ్డు చెప్పడంతో పందెం రాయుళ్లు దిగాలు పడ్డారు. సంక్రాంతి నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ బృందం ఆకస్మిక దాడులు జరపడంతో చాలా చోట్ల గంటల తరబడి పందేలను నిలిపివేశారు. కొంత విరామం పందేలు కొనసాగాయి. కనుమ రోజైన సోమవారం పందేలు మరింత జోరుగా సాగాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: రాపర్తి వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఆ గ్రామంలో రెండు బైకులు ఢీకొనడంతో ఓ బైక్‌పై ఉన్న పెదపాటి ఈశ్వరరావు (31) అక్కడికక్కడే మృతి చెందాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పాదగయ క్షేత్రంలో గో పూజ


పశువుల కొట్టంలో గోపూజ చేస్తున్న రైతు కుటుంబం


కాండ్రకోటలో గోపూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు

కేరింత.. పులకింత

- వేడుకగా సంక్రాంతి సంబరాలు
- బంధువులతో ప్రతి ఇంటా సందడి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం: చీకటిని చీల్చే వెలుగులు.. పాతను వదిలి కొత్తకు ఆహ్వానాలు.. పిల్లా పాపల కేరింతలు.. తెలుగువారి సంస్కృతిని చాటే సంక్రాంతి వేడుకలను పిఠాపురం నియోజకవర్గంలో అట్టహాసంగా నిర్వహించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను చాటే ఈ పండగను పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో వేడుకగా జరిపారు. సంక్రాంతి అన్నివర్గాలకు పెద్ద పండుగే. ధనుర్మాసంలో మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతిని పిల్లల నుంచి పెద్దల వరకూ సందడిగా జరుపుకొన్నారు. పల్లెలు, పట్టణాల్లో మహిళలు తెలుగుతనం ఉట్టిపడేలా ప్రతి ఇంటా ముగ్గులు వేసి కొత్త అందాలు తీసుకువచ్చారు. డూడూ బసవన్నలు, హరిదాసులు, జంగమదేవరులు వీధుల్లో తిరుగుతూ కీర్తనలతో ఆకట్టుకున్నారు. కొత్త సినిమాలు, కొత్త దుస్తులు, ధాన్యం, కోడి పందేలు, కొత్త అల్లుళ్ల రాకతో సందడి నెలకొంది. ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడాయి. వివిధ గ్రామాలలో పలువురు యువతులు పోటీపడి రంగు రంగుల ముగ్గులను తీర్చిదిద్దారు.

భక్తులతో నిండిన ఆలయాలు

మకర సంక్రాంతి రోజున బియ్యం, నువ్వులతో శివుడిని అభిషేకిస్తే మంచిదన్న నానుడి ఉండడంతో గ్రామస్తులు ఈ అభిషేకాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. కొత్తపల్లి, పిఠాపురం అయ్యప్ప స్వామివారి ఆలయాల్లో మకరజ్యోతి దర్శనాలు జరిగాయి. శివాలయాల్లో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండగ చివరి రోజు ముక్కనుమను మంగళవారం జరుపుకోనున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బళ్లపై వేషాలు వేసి ఆకట్టుకున్నారు. వివిధ దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా కనుమ పండగ

సంక్రాంతి మరునాడు వచ్చే కనుమ పండగకు విశిష్ట స్థానం ఉంది. పశు సంపదను లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా భావించి పూజించే పండగే కనుమ. కనుమ పండగ నాడు మినుములతో చేసిన వంటకాలకు ప్రాధాన్యం ఇస్తారు. అందుకే భోజనాల్లో గారెలు, సున్నుండలు తప్పనిసరిగా వడ్డిస్తారు. వివిధ రకాల కూరగాయలతో తయారు చేసే కలగలుపు కూరలను తింటారు. పిఠాపురంలో ప్రముఖ పుణ్య క్షేత్రాలైన పాదగయ కుక్కుటేశ్వరస్వామి, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో సోమవారం ప్రత్యేక గోపూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని గోవులకు ప్రత్యేక అలంకరణలు చేసి వేదమంత్రాల నడుమ పూజలు చేశారు. గోశాలలను సైతం అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: సంక్రాంతి సంబరాలను పెద్దాపురం పట్టణంలోను, మండలంలోను వైభవంగా నిర్వహించారు. ఆది, సోమవారాల్లో సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు కుటుంబ సమేతంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతీ ప్రదానం చేశారు.

కాండ్రకోటలో గోదా కల్యాణం

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కాండ్రకోటలో గోదా రంగనాథుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గీతా సమాజం ఆధ్వర్యంలో స్థానిక కృష్ణాలయంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. నూకాలమ్మ ఆలయంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు గోపూజ చేశారు. అలాగే సోమవారం స్థానిక మరిడమ్మ వారి ఆలయంలో గోపూజ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ రామ్మోహనరావు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, ఆలయ ముఖద్వారం వద్ద గోపూజ చేశారు.

గోవులకు పూజలు

సామర్లకోట: కనుమ పండగ కావడంతో సోమవారం పలుచోట్ల గోపూజ నిర్వహించారు. ధర్మపథకం కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచారామ క్షేత్రంలో ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయంలోని నంది విగ్రహాలకు పట్టు వస్త్రాలతో అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు నేతల వెంకటలక్ష్మి, యండమూరి వెంకట సుబ్బారావు, చందలాడ వెంకట్రావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నాతిపాముల సూరిబాబు పాల్గొన్నారు. అలాగే రైతులు తమ పొలాల్లోని గోవులకు స్నానాలు చేయించి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. ఆవులకు పండ్లు ఆహారంగా పెట్టారు.


చేబ్రోలులో బళ్లపై వేషధారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొత్తపల్లి: మండలంలో ప్రజలు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకొన్నారు. ఆయా దేవాలయాల వద్ద సందడి నెలకొంది. కనుమ పండగ సందర్భంగా పశువులను శుభ్రంగా కడిగి పూల దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లిలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, గొర్స, రమణక్కపేట, మూలపేట, ఉప్పాడలో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

అలరించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్

సామర్లకోట: ప్రధాని మోదీ ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం రాత్రి సామర్లకోట స్టేషన్‌లో అలరించింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న ఈ ట్రెయిన్ ప్రయాణికులు వీక్షించడానికి వీలుగా సామర్లకోట స్టేషన్‌లో సుమారు 30 నిమిషాల పాటు ఆగింది. దాంతో అనేక మంది వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను తిలకించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో పాటు అనేక మంది బీజేపీ నాయకులు సామర్లకోట చేరుకొని రైలును తిలకించారు. సామర్లకోటలో ఈ ట్రైన్‌కు స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్ ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రయాణికులు డిమాండ్ చేశారు. ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి ఎక్స్‌ప్రెస్‌లను వేయడం అన్యాయమంటూ నిరసన తెలిపారు. బీజేపీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, యార్లగడ్డ రామ్‌కుమార్, పెదిరెడ్డి రవికిరణ్, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు మద్దాల శ్రీను, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దేశ సైన్యంలో చేరాలి

కాకినాడ రూరల్: దేశ సేవలో తరించడం కోసం అర్హత గల యువత సైన్యంలో చేరాలని ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.నగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో 75వ జాతీయ సైనిక దినోత్సవం ఘనంగా జరిగింది. ఆధ్యాత్మిక వేత్త రవి శంకర్ పట్నాయక్ మాట్లాడుతూ త్యాగానికి మరో రూపం సైనికుడన్నారు. సైనికులు సాధించిన విజయాలను వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తొండంగి మండలం పాత పెరుమళ్లపురం గ్రామానికి చెందిన కొయ్య సింహాచలం (63) తన అల్లుడైన నెమల కృష్ణతో కలసి ఆదివారం బైక్‌పై కాకినాడ వెళ్లి తిరిగి వెళ్తుండగా పొన్నాడ శివారు మల్లివారితోట సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం కాకినాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సింహాచలం చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా కావమ్మ తిరునాళ్లు


కావమ్మ, మారెయ్యలను దర్శించుకుంటున్న భక్తులు


సామర్లకోట పీబీసీలో ఏర్పాటు చేసిన బెలూన్‌లో చిన్నారుల విన్యాసాలు

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ఆకర్షణగా నిలిచిన నీటి బెలూన్

సామర్లకోట: కావమ్మ తిరునాళ్లు ఘనంగా జరుగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారంతో ముగుస్తాయి. కనుమ పండగ, సోమవారం కావడంతో వేలాదిగా భక్తులు కావమ్మ, మారెయ్యలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక రజక వీధిలో ఏలేరు కాలువ ఆవలి వైపున ఉన్న కావమ్మ ఆలయాన్ని సుమారు 250 ఏళ్ల క్రితం నిర్మించారు. ఏటా సంక్రాంతి నాటి నుంచి మూడు రోజుల పాటు ముక్కనుమ వరకు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడి బెస్త కులానికి చెందిన సుకపట్ల లక్ష్మయ్య, వెంకయమ్మ దంపతులకు కాత్యాయినీ మాత వరంతో కావమ్మ జన్మించింది. ఈశ్వర సంభూతుడైన మారయ్యను ఆమె చిన్న వయస్సులోనే వివాహమాడింది. భర్త మృతితో కావమ్మ సతీ సహగమనం చేసింది. ఆమె సతీ సహగమనం ప్రదేశంలో కావమ్మ, మారెయ్యల విగ్రహాలతో ఆలయాన్ని నిర్మించారు. కావమ్మ మృతదేహానికి స్నానం చేయించిన ప్రదేశంలో బావి ఏర్పాటు చేశారు. ఆ బావి నిత్యం నీటితో నిండి ఉంటుంది. దాంతో సంక్రాంతి రోజుల్లో కావమ్మ ఆలయం వద్ద తిరునాళ్లు జరుగుతాయి. కావమ్మ తిరునాళ్లకు వచ్చిన గర్భిణులు పండ్లను బావిలో వేస్తారు. తేలితే మగ బిడ్డ, మునిగితే ఆడ బిడ్డ పుడతారని భావిస్తారు. ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ ఆది, సోమవారాల్లో అనేక మంది గర్భిణులు బావిలో పండ్లు వేశారు. మారెయ్య, కావమ్మ వారసులు సుకపట్ల ఆదినారాయణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు అనేక గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయానికి చేరుకోవడానికి ఏలేరు కాలువపై కాలి బాట వంతెన నిర్మాణం చేశారు. భక్తుల కోసం పిఠాపురం బ్రాంచి కెనాల్‌లో నీటిలో బెలూన్ ఏర్పాటు చేసి చిన్నారులను ఆకర్షించేలా చేశారు. చిన్నారులు ఆ బెలూన్‌లో విన్యాసాలు చేశారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక కుమారారామ భీమేశ్వరస్వామి వారి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు, కనుమ పండగ కావడంతో తెల్లవారు జామున పండితులు స్వామి వారికి అభిషేకాలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో స్వామి వారికి తొలి పూజ చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ మూల విరాట్‌తో పాటు ఉపాలయాల్లోను పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లను అలంకరించారు. ఈఓ నాగమల్లేశ్వరరావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, చందలాడ వెంకట్రావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ నేతల హరిబాబు, ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

మకర జ్యోతి దర్శనం


అయ్యప్పస్వామి విగ్రహం ఊరేగింపు

కొత్తపల్లి: అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం పరమ పవిత్రమని పండితులు తెలిపారు. నాగులపల్లి, కొత్తపల్లిలో ఉన్న అయ్యప్పస్వామి, శ్రీధర్మశాస్త్ర ఆలయంలో ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లిలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఊరేగించారు.

పేదలు, వృద్ధులకు వస్త్రదానం


పేదలకు వస్త్రదానం చేస్తున్న సత్యనారాయణ, అప్పారావు కుటుంబ సభ్యులు


సామర్లకోట ఉప్పువారి సత్రం ధర్మకర్తల ఆధ్వర్యంలో వస్త్రదానం

సామర్లకోట: స్థానిక సంగీతరావుపేట, అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద సోమవారం పేదలు, వృద్ధులకు వస్త్రదానం చేశారు. వేల్పుల పద్మరాజు, నాగన్నల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సంగీతరావుపేట, బలుసులపేట, వీర్రాఘవపురం ప్రాంతాల్లోని 200 మంది పేదలను గుర్తించి వస్త్రదానం చేశారు. గత ఆరేళ్లుగా ఏటా కనుమ రోజున వస్త్రదానం చేస్తున్నట్టు వేల్పుల సత్యనారాయణ, నూకరత్నం, అప్పారావు తెలిపారు. పండగ రోజులోనైనా పేదలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పువారి సత్రం ఆధ్వర్యంలో..

సంక్రాంతి సందర్భంగా స్థానిక ఉప్పువారి సత్రం ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఆదివారం వస్త్రదానం చేశారు. ఏటా సంక్రాంతి రోజున ఈ సత్రం ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం చేస్తారు. పిఠాపురం రోడ్డులో ఉప్పు సీతారామయ్య పేరున ఆయన కుమారులు సత్యనారాయణ, సూర్యారావు 1941, అక్టోబరు 30వ తేదిన సత్రం స్థాపించి 26 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఈ భూమిని సాగు చేసుకోవడానికి బహిరంగ వేలం నిర్వహించి లీజు కు ఇస్తారు. ఆ భూమిపై వచ్చే ఆదాయంతో పిఠాపురం రోడ్డులో వెళ్లే బాటసారులకు మంచినీరు, వేసవిలో మజ్జిగ, సంక్రాంతికి వృద్ధులకు వస్త్రదానం, మహాశివరాత్రిలో పంచారామ క్షేత్రం వద్ద భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ చేస్తారు. అలాగే దేవదాయ శాఖ అనుమతితో కార్తిక మాసంలో వన సమారాధన నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సీతారామయ్య మనవడు, సూర్యారావు కుమారుడు అయిన సత్యనారాయణ వ్యవస్థాపక ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.

31 నుంచి వేంకటేశ్వర కల్యాణోత్సవాలు


వేట్లపాలెంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయం

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకూ కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. 31న స్వామి వారిని, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించి, మేళతాళాలలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఫిబ్రవరి 1న గోపూజ, స్వామివారికి 9 రకాల పూలతో 108 మంది దంపతులచే లక్ష పుష్పాల పూజ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం శేష వాహన సేవ, రాత్రికి స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు.ఉత్సవాల ప్రారంభ నుంచి ముగిసే వరకూ రోజు వాహన సేవలు ఉంటాయన్నారు. మూడో తేదీన సదస్యం, 4న లక్ష గోవింద నామ గానామృతం, విష్ణు సహస్ర నామ పారాయణ, 5న శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఒకటి నుంచి భజన పోటీలు : స్వామి వారి కల్యాణోత్సవాలను పురస్కరించుకొని ఫిబ్రవరి ఒకటి నుంచి మండల స్థాయి, జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా ఒకటి, రెండు తేదీలో మండల స్థాయిలోను, మూడు నుంచి ఐదో తేదీ వరకూ జిల్లా స్థాయిలోను భజన పోటీలు జరుగుతాయన్నారు.

వైభవంగా పెద్దాపురం సత్తెమ్మ సంబరం


అమ్మవారి జాతర ప్రారంభిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: స్థానిక జగ్గంపేట రోడ్డులో కొలువైన సత్తెమ్మ అమ్మవారి సంబరాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గంటల తరబడి భక్తులు క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సంబరాన్ని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు పప్పల నాగరాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. దొరబాబు వెంట ఆయన సతీమణి కళ, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి ఉన్నారు. సీఐ నబీ ఆధ్వర్యంలో ఎస్ఐ వెలుగుల సురేష్ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, గోపు మురళి, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్ళి వీర్రాఘవులు పాల్గొన్నారు. సత్తెమ్మ వారికి స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూజలు నిర్వహించారు. పప్పల పెదబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.జాతరను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన ధనుర్మాసోత్సవాలు


పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం

పిఠాపురం: నియోజకవర్గంలో ధనుర్మాసోత్సవాలు ముగిశాయి. నెల రోజుల నుంచి వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, గోదాదేవి కల్యాణాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక పంచమాధవ క్షేత్రమైన కుంతీమాధవస్వామి, వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో స్వామివారికి గరుడ వాహనంపై గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నెల రోజుల పాటు రోజూ స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సోమవారం ధనుర్మాసోత్సవాల ముగింపుతో పాటు కనుమ పండగ కావడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

ముగ్గుల పోటీలు

సామర్లకోట: సంక్రాంతిని పురస్కరించుకొని సత్యనారాయణపురంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్. సుధారాణి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. డిజైన్స్ ముగ్గులో రాణి ప్రథమ, లోకారెడ్డి విజయలక్ష్మి ద్వితీయ, కరణం అనిత మూడవ, కోడూరి నాగలక్ష్మి నాల్గవ బహుమతి గెలుచుకున్నాయి. చుక్కల ముగ్గుల్లో కొసనం సునీత ప్రథమ, మలిరెడ్డి దీప్తి ద్వితీయ, రాణి తృతీయ, బండారు వరలక్ష్మి నాల్గవ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు కర్రి బాబూరావు, సేపెని రూప, బావిశెట్టి భద్రరావు, సమయం అబ్బులు పాల్గొన్ని బహుమతులు అందజేశారు.

ఇండియన్ బ్యాంక్
కాకినాడ బ్రాంచ్
37-1-7/2, గోల్డ్ మార్కెట్ సెంటర్, మెయిన్ రోడ్, కాకినాడ - 533001.
ఫోన్: 0884-2376081. ఫ్యాక్స్: 0884-2371445. ఈ-మెయిల్: kakinada@indianbank.co.in
స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
అనుబంధం - 4 (రూల్ - 8 (1))
[illegible]
తేది : 10-01-2023 సం/-అధీకృత అధికారి
ప్రదేశం : కాకినాడ ఇండియన్ బ్యాంక్